"శ్రీదేవి భర్త చచ్చిపోయాడు"

"అదేమిటి?" అన్నాను తుళ్ళిపడ్డట్టుగా.

"నిజం" అన్నది సీత నన్ను నమ్మించడానికన్నట్టు.

"నువ్వు చెప్పేది....అంటే నేను నిన్న ఉదయమే బస్సులో నుండి వాళ్ళిద్దరూ స్కూటర్ మీద వెళ్ళడం చూసాను...." తడబడుతూ అన్నాను.

"అవును శారదా....నిన్న సాయంత్రం ఆయన ఒక్కడూ స్కూటర్ మీద వస్తూ ఉండగా ఆక్సిడెంట్ జరిగిందట. భర్త కోసం ఎదురు చూస్తున్న శ్రీదేవికి ఈ దుర్వార్త చేరిందట. హాస్పటలు నుండి రాత్రే తీసుకువచ్చారట. ఉదయం అంత్యక్రియలు కూడా జరిగి పోయాయని నాకు ఇందాకనే తెలిసింది; తెలిసిన వెంటనే నీ దగ్గరకు వచ్చాను" అన్నది సీత. నేను లోలోపల గజగజ వణికి పోయిన మాట నిజం. పైకి మాత్రం ధైర్యంగా "సరే పద. చూసి వద్దాం" అన్నాను. ఉన్నపాటునే లేచి చెప్పులు తొడుక్కుని కర్ఛీఫ్‌లో పది రూపాయల నోటు మడతపెట్టి పెట్టుకుని సీతతో పాటు బయల్దేరాను.


శ్రీదేవి, సీత, నేను కలిసే చదువుకున్నాం బి. ఎ. వరకూ. మా బేచ్‌లో మేం ముగ్గురం అత్యంత సన్నిహితంగా ఉండేవాళ్ళం. ఆ స్నేహం ఇంతవరకూ క్రమం తప్పకుండా వచ్చింది. బి. ఎ పూర్తయిన తరువాత శ్రీదేవి టీచర్స్ ట్రైనింగ్‌కి- సీత, నేను పోస్టుగ్రాడ్యుయేషన్‌కి వెళ్ళాం. ట్రైనింగ్ తరువాత శ్రీదేవికి పెళ్ళి కావడమూ ఉద్యోగం రావడమూ ఇంచుమించుగా ఒకేసారి జరిగాయి. సికింద్రాబాద్‌లోనే హైస్కూల్లో జాయినయి నాలుగేళ్ళలోనే ఇద్దరు పిల్లల తల్లైంది శ్రీదేవి.

సీతకు, నాకు వేర్వేరు సంస్థలలో ఉద్యోగాలు వచ్చినా ఇళ్ళు దగ్గర కావడం వల్ల తరచుగా కలుసుకుంటూ ఉంటాం. శ్రీదేవిని చూడాలంటే ఏ సెలవు నాడో పని గట్టుకుని సమయానుకూలంగా వీలు చేసుకోవడం ఏ నాలుగైదు నెలల కొకసారో గానీ కుదిరేది కాదు. అందుకే నేను తరచుగా ఫోన్‌లో మాట్లాడే దానిని.

శ్రీదేవి భర్త మితభాషి – ఎక్కువగానే కాదు, తక్కువలో కూడా పరిమితంగా మాట్లాడేవాడు. మేము వెళ్ళినా ఏదో సభ్యత కోసమన్నట్టు పలకరించి కొంతసేపు కూర్చుని లేని పని ఏదో కల్పించుకుని బయటకు వెళ్ళి పోయేవాడు. పిల్లలు ముచ్చటగా ముత్యాల్లా ఉంటారు. అటువంటి సౌమ్య శీలం కల భర్తతోను ఆ చక్కని పిల్లలతోను ఆమె సంసారం నిండుగా ఏ అసంతృప్తి లేకుండా సాగిపోతోందని చూసే వాళ్ళెవ్వరికైనా అనిపించక పోదు.

అయితే నాకెప్పుడూ ఒక్కటే సందేహం. మిలమిల మెరుస్తున్న తాజా రోజాను ఏ రాక్షస హస్తమో కసిగా నులిమేసి రాల్చేసి కాలరాచినట్లు త్రుటి కాలంలో ఈ మానవ జీవితం ఎందుకలా వికృతంగా మారిపోతుందో నాకర్థం కాదు. ఎంతగానో ఆలోచించి తల బద్దలు కొట్టుకుని చివరికి "అది అంతే – విధి" అని ఊరుకొంటారు అందరూ. "అంతే కాబోలు – చేతిలో ఉన్నంత వరకే మానవ ప్రయత్నం. ఆపైన...." అనుకుంటాను నేను.

మేం కూర్చున్న ఆటో శ్రీదేవి వాళ్ళ ఇంటి ముందు ఆగింది. డబ్బు చెల్లించి శ్రీదేవి వాళ్ళ ఇంటి గుమ్మం వరకు వెళ్ళిన తరువాత నా గుండె దడదడలాడింది. నా కాళ్ళల్లోని శక్తంతా ఇగిరి పోయి కాళ్ళు చల్లబడి భూమికి అతుక్కుపోయి



# బొట్టు

జ్యోతిర్మయి

నట్టుగా అయిపోతే భయంగా సీత భుజం పైన చెయ్యి వేసాను.

"పరవాలేదు పద". ఇంతవరకూ వచ్చాక ఎదురోక్కక తప్పదన్నట్టు ముందుకు అడుగు వేసింది సీత.

ఇల్లంతా అతి నిశ్శబ్దంగా గాలి కూడా స్థంభించి పోయినట్టుగా అనిపించింది. ఇంట్లో అప్పటికి ఉన్న మనుష్యులంతా ఎక్కడబడితే అక్కడ నేలమీద చతికిలబడి జీవం లేనట్టుగా గోడలకో, స్థంభాలకో జారబడి ఉన్నారు. కళావిహీనమైన శిల్పాల్లా కూర్చున్న వాళ్ళ కళ్ళల్లోకి చూస్తుంటే జీవం ఉన్నదా లేదా అనే అనుమానం రాక తప్పదు. ఆ సంఘటన అటువంటిది.

అడుగులో అడుగు వేసుకుంటూ శ్రీదేవి పడక గదిలోకి వెళ్లాం, సీత నేను. శ్రీదేవి ఒక గోడవారగా చిన్నపిల్లను ప్రక్కలో వేసుకుని చాపమీద పడుకుని ఉంది. మరొక చాపమీద శ్రీదేవి తల్లి, పెద్ద పిల్లను ఒడిలో వేసుకుని కూర్చుంది.

సీత, నేను శ్రీదేవి ప్రక్కగా కూర్చున్నాం. శ్రీదేవి తల తిప్పి మా వైపు చూసింది.

సీత అన్నది "ఈ రోజే తెలిసింది....ఇలా జరిగిపోయిందన్న వార్త నిజం కాకూడదనుకుంటూ వచ్చాను" సీత కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

నాకు నోట మాట రాలేదు. శ్రీదేవి చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను. ఏదో చెప్పబోయాను. గొంతు పెగల్లేదు. శ్రీదేవిని చూస్తే ఎందుకో ఒళ్ళు గగుర్పొడిచింది. మమ్మల్ని చూసి భోరున ఏడుస్తుందేమోననుకున్నానుగానీ అలాంటిదేమీ జరగలేదు. శ్రీదేవి జీవంలేని బొమ్మలా అలా పడుకునే మా కళ్ళల్లోకి పిచ్చిగా చూడసాగింది. ఆ చూపుల్లో నాకు ధైర్యంగానీ బాధగానీ భయం గానీ ఏమీ స్పష్టంగా కనిపించలేదు. ఏదో మూగతనం, సరిగ్గా చెప్పాలంటే వెర్రితనం తప్ప.

అలా సీతా నేనూ మౌనంగా మాటలు భావాలూ లేని బొమ్మల్లా గంటకు పైగా శ్రీదేవి దగ్గిర కూర్చుని, తిరిగి వచ్చేసాం.

శ్రీదేవిని ఓదార్చడం కోసం, మళ్ళీ మామూలు మనిషిని చేసి నలుగురిలోనూ తిరిగే ధైర్యాన్ని కలిగించడం కోసం, నాలుగు మాటలు చెప్పి తనకు ఓదార్పును కలిగించాలనే ఉద్దేశ్యంతో నేను తరచుగా వీలు చేసుకుని వెళ్ళడం మొదలు పెట్టాను. ఇక ఉద్యోగం మానేస్తాననీ, పరులకు తన ముఖాన్ని చూపలేననీ మొదట్లో బాధపడిన శ్రీదేవి, రాను రాను పరిస్థితులకోసం, పిల్లల భవిష్యత్తు కోసం, తన నిండు జీవితాన్ని వ్యర్థం కాకూడదనే నిర్ణయానికి తానే వచ్చింది.

రెండు నెలల తరవాత శ్రీదేవి మళ్ళీ స్కూల్లో చేరింది. నేను కూడా క్రమంగా వెళ్ళడం తగ్గించేసాను.

రోజులు మామూలుగానే గడుస్తున్నాయి. ఓ రోజు పబ్లిక్ గార్డెన్స్ దగ్గర బస్ కోసం నిల్చున్నాను. సరిగ్గా బస్ ఆగిన క్షణంలోనే సీత అటునుండి వస్తూ ఆగమన్నట్టు చెయ్యి ఊపింది. బస్ వెళ్ళిపోయింది. సీత వచ్చి అన్నది "తరువాత రిక్షాలో వెళ్లాంలే. కాసేపు అలా గార్డెన్స్‌లో కూర్చుందాం" అని.

ఇద్దరం పచ్చిక మీద కూర్చుని వేరు శనక్కాయలు కొనుక్కుని తింటూ కబుర్లు చెప్పుకుంటూ ఉండగా మధ్యలో సీత అడిగింది. "నువ్వీ మధ్యన శ్రీదేవిని చూశావా?" అని.

"లేదు సీతా. వెళ్ళాలని అనుకుంటూనే ఆలస్యం చేస్తున్నాను. ఏమనుకుంటుందో ఏమో....నువ్వుగాని వెళ్ళావా?" అన్నాను.

"ఈ మధ్యన నేనూ వెళ్ళలేదు....ప్చ్...."

కొంచెం ఆగి నిట్టూర్చి అన్నది సీత "బహుశః ఇంక వెళ్ళను శారదా! వెళ్ళాలనిపించడంలేదు."

"అదేమిటి?" ఆశ్చర్యంగానే అన్నాను.

సీత వెంటనే జవాబు చెప్పలేదు. తన ముఖం లోని రంగులు మాత్రం మారడం సాయంత్రపు నీరెండలో స్పష్టంగా గమనించాను.

సీత ఎటో చూస్తూ మెల్లగా అన్నది "శ్రీదేవి మునుపటిలానే అలంకరించుకుంటూందట"

"అంటే?" నాకర్థం కాలేదు.

"అదే....మామూలుగా బొట్టు, కాటుక, పువ్వులు, గాజులు అన్నీ మళ్లా వేసుకుంటూం దట..." సీత కంఠంలో, అంత ద్వేషం ఎందుకో, ఆ ముఖంలో అంత కోపం ఎందుకో నాకు అర్థం కాలేదు. పైగా అదొక వింత విషయంలా కూడా తోచలేదు.

"నువ్వు చూడలేదా...." అన్నాను.

"చూడదలచుకోలేదన్నాను....చూడకుండా చెపుతున్నానని ఇది గాలివార్తనుకోకు. నూటికి నూరుపాళ్ళూ ఆధారంతోనే చెపుతున్నాను...."

"పరవాలేదు. నేను చూసివస్తాను...." అన్నాను.

## పుస్తకాలు

### ఓ పూవు రాలింది

(నవల)

[రచన: వావిలికొలను రాజ్యలక్ష్మి; ప్రచురణ: జయంతి పబ్లికేషన్స్, ఏలూరురోడ్డు, విజయవాడ-2; $\frac{1}{8}$ డెమీ సైజులో 209 పేజీలు; వెల రూ. 6-25; అట్టమీది మూడు రంగుల బొమ్మ: వి. యస్. ప్రకాష్]

దోసిళ్ళనిండా పాత్రలు, కలగాపులగంగా వుండే సన్నివేశాలూ ఎదురుగా పెట్టుకు కూచుని, నవల రాయడానికి సిద్ధపడితే—ఫలితం ఎలా వుంటుంది?—ఈ రచయిత్రి తీసుకున్న ఇతి వృత్తంలో బలం లేనట్టే, సన్నివేశాలలోనూ లేదు. పాత్రలు ఎలా వీలయితే అలా ప్రవర్తిం చేస్తాయి. వాటి 'ధోరణి' మారిపోవడానికి గల 'బలం' చాలా బలహీనంగా కనిపిస్తుంది. నిజానికి కథ 'సాగింది' గాని, నడవలేదు!

ఉదయకాంత్ అన్న పాత్ర ప్రవర్తనలోనూ జయంతి పాత్ర ప్రవర్తనలోనూ—ఒక 'విధానం' అంటూ కనిపించక పోవడంతో చదువరులు అగమ్యంలో పడతారు. ఏవి ముఖ్య పాత్రలుగా తాను భావించి, రచయిత్రి కథ నడిపారో—కథ ఆ పాత్రలతో అంతం కాకుండా, తర్వాత వచ్చిన పాత్రలతో అంతం కావడం వల్ల—ప్రాముఖ్యత ఎటో తిరిగి పోయినట్టుగా అనిపిస్తుంది. అంత కంటే—కొట్టొచ్చినట్టుగా కనిపించేది — కథలో ఏ మాత్రం సమస్య లాంటిది లేకపోవడం! దాంతోనే నడక కుంటుపడుతుంది; నూటయాభై పేజీలు చదివినా, ఇంకా మొదట్లోనే వున్న భావన కలుగుతుంది! అలా కాకుండా, అధ్యాయానికి అధ్యాయానికీ కథ ఒక్కో మెట్టు పైకి ఎక్కుతూ వుంటే—కథ ఎలాంటిదయినా రసవత్తరంగా కనిపించడానికి ఆస్కారం వుండేది.

"అది నీ యిష్టం. నాకు ఇటువంటి విషయాలంటే ఒళ్లు మంట. భర్త ఉన్నప్పుడు పతివ్రతల్లా నటించడం, మీ చేతుల్లో సుమంగళిగా పోవాలనుందనే మాటలు చెప్పడం, ఆయనగారు ముందు వెళ్ళిపోతే మొదట శోకదేవతలా దర్శనమిచ్చి నలుగురి సానుభూతి మాటలతోను కన్నీరు మున్నీరుగా ఏడ్చి నాలుగు నెలలైనా తిరగకముందే మళ్ళీ మోజు తీరని సరదాలకి షోకులకి పోయి, ఆ చచ్చినవాడి జ్ఞాపకాన్ని కూడా మర్చిపోవడం–పాతికేళ్ళ వయసుకే ఆ శ్రీదేవి ప్రజల ఆదరణ కోల్పోయింది. సంఘానికి శత్రువులా బ్రతుకుతూంది. ఇవన్నీ ఆమెను వేధించే బాధలు. మనసుకు శాంతికి నివ్వలేని వేదనలు. ఈ రోజు శ్రీదేవి ఎవ్వరి ఎదురుగా పడినా ఆమెను దూషించడమే తప్ప సానుభూతి చూపించలేకపోతున్నారు. వీళ్ళంతా తనను సుఖంగా బ్రతకనివ్వడం లేదని కుమిలిపోతుందే తప్ప అవి తాను చేజేతులా కల్పించుకున్న పరిస్థితులని గ్రహిస్తుందా శ్రీదేవి?"

"ఛ. నువ్వు కూడా అలా మాట్లాడుతున్నావేం సీతా?" అన్నాను ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ.

ఇంచుమించు శ్రీదేవి వయసుదే అయిన సీత – ఉన్నత విద్యనభ్యసించి బాధ్యతగల ఉద్యోగినిగా ఉంటూ ఒక అవివాహితగా సంఘంలోని అవకతవకలను కూడా ఎదుర్కొంటూ ధైర్యంగా సంఘ సమస్యలను గురించి తర్కించే సీత – ఒక స్వల్ప విషయాన్ని తీసుకుని, ఒక సాటి స్త్రీ దురదృష్ట జీవితాన్ని గురించి ఇంత విపరీతంగానూ, సంస్కార హీనంగాను ఎలా మాట్లాడగలుగుతూంది?....

"సీతా! నీ ఉద్దేశం నాకు పూర్తిగా అర్థం అయ్యింది కానీ, శ్రీదేవి ఆ బారెడు జుట్టునీ వేలుముడితో బిగించి, ముఖాన బొట్టు లేకుండా, చేతులు బోసిగా వదిలేసి తెల్లచీరెలో శోకదేవతలా దర్శనమిస్తేనే కానీ బ్రతకనివ్వరంటావు అంతేనా?"

"అది కాదు. అసలు భర్తే పోయిన తర్వాత ఆ అలంకారమంతా ఎవరి కోసమని?"

నేను నవ్వాను.

"నీకూ లేదు భర్త. మరి నీ అలంకారమంతా ఎవరి కోసమని?"

"శారదా!" కోపంగా చూసింది సీత.

"అంటే పెళ్ళికాని నేను, పెళ్ళయి భర్త పోయిన విధవ శ్రీదేవి ఇద్దరమూ ఒకటేనన్న మాట" 'విధవ' అన్న మాటను ఒత్తి పలుకుతూ కోపాన్ని పళ్ళలో చూపిస్తూ పళ్ళు కొరికింది.

నేను మళ్ళీ నవ్వాను.

"ఈ 'విధవ' అనే ముద్రవేసి ఆమె రూపాన్ని వికృతంగానే చూడాలనుకునే నీలాంటి వాళ్ళను ఒకే ప్రశ్న అడుగుతున్నాను. కోపం తెచ్చుకోకు. శ్రీదేవి ఏ బొట్టు కాటుక, గాజులతో అలంకరించుకుంటూందో అదే అలంకారం, నువ్వు ప్రతి ఆడపిల్లా కూడా చేసుకుంటున్నారు. ఇవి ప్రతి పిల్లకీ పురిటినుంచీ వస్తున్న ముచ్చట్లే కానీ పెళ్ళితో రాలేదు సీతా. పెళ్ళి జరిగిన నాటినుండీ భర్తతోపాటుగా వచ్చిన మంగళసూత్రాలు, మట్టెలు, నల్లపూసల వంటివేవో అతడి మరణంతోపాటుగా తీసేస్తే బాగానే ఉంటుంది. అంతేగానీ పుట్టుకతో వచ్చిన అలంకారమంతా మధ్యలో వచ్చిన వ్యక్తితో పోవాలని ఎక్కడుంది?"

"మన సంప్రదాయాల్లో."

"ఎక్కణ్ణుంచి వచ్చాయి ఈ సంప్రదాయాలు? సంప్రదాయాలంటూ అఘోరించే ఈ పెద్ద మనుషులంతా ఆ సంప్రదాయాలను ఎందుకు అనుసరిస్తున్నారో ఎదుటి వాళ్ళ నెత్తిన ఎందుకు రుద్దాలనుకుంటున్నారో, అసలు వాటి అర్థం పర్థం ఏమిటో గట్టిగా ప్రశ్నిస్తే ఎవ్వరూ నీకు విడమర్చి చెప్పలేరు. ఇవన్నీ ఎవరి పరిస్థితులకు తగ్గట్టు వారు వ్యక్తిగతంగా కల్పించుకున్నవే మొదట. రాను రాను అంటువ్యాధిలా వ్యాపించి వాటికి మనలను బానిసలుగా చేసుకున్నాయి.




పావోలా బ్రెసియానో అన్న 19 ఏళ్ళ అమ్మాయి 'మిస్ ఇటలీ'గా ఎన్నికైంది. విశేషం ఏమిటంటే – ఆమె కాళ్ళను 500 మిలియన్ లిరాకు ఇన్స్యూర్ చెయ్యడం! ఆమె తమ ఊళ్ళో ఫుట్‌బాల్ ఆట ఆడే స్త్రీల జట్టులో 'సెంటర్ ఫార్వర్డ్'గా పాల్గొంటుంటుందట!

నేడు స్త్రీ జాతి ఏదో ఉద్ధరించబడాలనీ, సంఘంలో గౌరవంగా బ్రతకాలనీ, సమాన హక్కులు కావాలనీ లెక్చర్లిచ్చిన వాళ్ళల్లో నువ్వు ఉన్నావు. అటువంటిది అసలే భర్తపోయి కుమిలిపోతున్న శ్రీదేవి వంటి స్త్రీలను, తాను స్త్రీగా అలంకరించుకున్నందుకే లోకులు కాకుల్లా పొడుస్తుంటే సరిదిద్దవలసింది పోయి, వాళ్ళతో చేతులు కలిపితే అటువంటి అభాగ్యులను ఎవరాదుకుంటారు సీతా! కేవలం శ్రీదేవి బొట్టు పెట్టుకున్నందుకే అందరి సానుభూతినీ కోల్పోయిందని నువ్వన్నావు చూడు. అంటే వీళ్ళంతా పరోక్షంగా ఆమెను జీవితమంతా దుఃఖాన్ని భరిస్తూ చీకటిని అనుభవిస్తూ కన్న బిడ్డలకు కూడా వికృత రూపంలో దర్శనమిస్తూ కుమిలిపోతూ నూరేళ్ళ బ్రతుకునూ యీడ్వవలసిందని ఆదేశిస్తున్నారన్న మాట. అదే వాళ్ళ ఉద్దేశ్యమయితే అటువంటి వాళ్ళ ఆపేక్ష భరించడం కూడా కష్టమే కాబట్టి–శ్రీదేవి వంటి స్త్రీలు – ఆరకమైన రాక్షసుల సానుభూతిని కోరకూడదు సీతా" బాధగా అన్నాను.

"నువ్వేమన్నయినా చెప్పు. నన్ను నిందించినా సరే, శ్రీదేవి వంటి స్త్రీలను నేను క్షమించను" ఇంకా ఆవేశంగానే అంది సీత.

"నువ్వే కాదు. నీవంటి చదువుకున్న వారైన స్త్రీలలో తొంభయితొమ్మిది శాతం ఆమెను క్షమించరు. అటువంటి వారి క్షమాపణ శ్రీదేవికి అవసరం లేదు. కానీ నీవంటి వారితో నా మనవి ఒక్కటే. శ్రీదేవి వంటి స్త్రీలను ఏ మాత్రం పట్టించుకోకుండా 'తనకిష్టమయింది. తానలా ఉంద'ని ఊరుకుంటే అదే పదివేలు. కాకుల్లా చుట్టూ చేరి పొడవకుండా తన మార్గాన తన్ను సుఖంగా ఉండనిస్తే నేడు మనం సాటి స్త్రీకి అంతకంటే చేయదగిన మేలు లేదు. అంతకంటె తమను తాము సంస్కరించుకుంటే చాలు. పద చీకటి పడింది" అన్నాను, లేస్తూ. □